# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 44 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 18 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :44 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 18 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## మున్సిపల్ పోరు: టీడీపీ రెండో జాబితా విడుదల.. మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు

- ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల కోసం టీడీపీ నుంచి మరో జాబితా
- మొత్తం 22 మంది అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించిన పార్టీ
- మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదా పేరు ఖరారు
- జాబితాలో 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ అభ్యర్థులు
- తొలి జాబితాలో ఇప్పటికే 36 మందిని ప్రకటించిన టీడీపీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ తన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 22 మందితో కూడిన రెండో జాబితాను శనివారం అధికారికంగా విడుదల చేసింది. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థితో పాటు 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్‌పర్సన్ అభ్యర్థుల పేర్లను

- మిగతా 2లో



## నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!

- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన
- రెండు పార్టీలకు గుణపాఠం చెప్పే మూడో ప్రత్యామ్నాయం రావాలన్న విజయసాయి
- నవంబర్ రెండో వారంలో కలుద్దామని, జెన్-జీ సిద్ధంగా ఉండాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో

- మిగతా 2లో



## ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

### చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ

- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం
- పులుల సంరక్షణ, అడవి దున్నల తరలింపుపై ఇరువురి మధ్య చర్చ
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలిపిన పవన్ కల్యాణ్



పెన్ పవర్ డెస్క్:మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ముందుగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన మోహన్ యాదవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు.

- మిగతా 2లో




## పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత

- పులివెందులలో స్థానిక ఎన్నికల నామినేషన్ల వద్ద ఉద్రిక్తత
- వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట
- జనాన్ని చెదరగొట్టేందుకు గాల్లోకి పోలీసుల కాల్పులు
- ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం
- ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో పులివెందులలో

- మిగతా 2లో

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

- మిగతా 2లో





## ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది.. కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్
- నామినేషన్ల ప్రక్రియలో టీడీపీ గూండాయిజం చేస్తోందని ఆరోపణ
- పోలీసుల సమక్షంలోనే ఎంపీలపై దాడులు జరిగాయని వెల్లడి
- చంద్రబాబు పాలనలో జంగిల్‌రాజ్ నడుస్తోందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని, ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ హింసకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.

- మిగతా 2లో

## దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం.. ఐదుగురి పరిస్థితి విషమం

- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దాండియా వేడుకల్లో భారీ ప్రమాదం
- లైటింగ్ స్టాండ్ విద్యార్థులపై కూలడంతో వనపర్తికి చెందిన సోనీ అనే విద్యార్థిని మృతి
- సుమారు 25 మంది విద్యార్థులకు గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలినట్లు ప్రాథమిక అంచనా
- ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం



పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం-2026' టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది.

- మిగతా 2లో

## నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

- మిగతా 2లో

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- నిరసన యాత్రకు ముందు దీప్కేను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- బెయిల్ ఇచ్చిన మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు
- రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశం
- ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని షరతు
- కన్నాట్ ప్లేస్‌లో నిరసన యాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు



పెన్ పవర్ డెస్క్:కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు న్యూఢిల్లీలోని మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ఆయన విడుదలకు మార్గం సుగమం చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 ప్రకారం, ఏడాది పాటు శాంతిభద్రతలకు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# రెయిన్ డేస్...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రాబోయే రోజుల్లో వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే తేలికపాటి వానలు పడతాయని, మోస్తరు వానలు తప్పించి భారీ వర్షాలు పడవని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తాయని, గంటలకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న నాలుగు రోజుల పాటు వానలు పడతాయని తెలిపింది.

**అక్కడక్కడ తెలంగాణలో వానలు...**

తెలంగాణలో నేడు అక్కడక్కడ వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడతాయని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన ఉరుములు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పెద్దపల్లి, భూపాలపల్లి, సిద్దిపేట, వరంగల్, రంగారెడ్డి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. హైదరాబాద్ లోపగటి ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగా నమోదయినా, రాత్రి వేళ వాతావరణం చల్లబడే అవకాశముందని తెలిపింది. పగటిపూట ఉష్ణోగ్రతలు సుమారు 31 డిగ్రీల నుంచి 33 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు.

**ఏపీలో ఉరుములు, మెరుపులతో ...**

ఆంధ్రప్రదేశ్ లో వాతావరణం పై అమరావతి వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు లేదా పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 30డిగ్రీల నుంచి 31 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రధానంగా రైతులు, పశువుల కాపర్లు పొలాల్లోకి వెళ్లినప్పుడు చెట్ల కింద, విద్యుత్తు స్థంభాల కింద నిలబడవద్దని కూడా వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు.నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు,

రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి

ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

# మున్సిపల్ పోరు: టీడీపీ రెండో జాబితా విడుదల.. మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు

- మొదటి పేజి తరువాయి

ఈ జాబితాలో ఖరారు చేసింది. పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ఈ ప్రకటన వెలువడింది.ఇటీవలే 36 మందితో తొలి జాబితాను ప్రకటించిన టీడీపీ, తాజాగా రెండో జాబితాను విడుదల చేయడంతో ఎన్నికల బరిలో దూకుడు పెంచినట్లయింది. ఈ జాబితాలో కీలకమైన మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాను ఎంపిక చేసింది. క్షేత్రస్థాయిలో పార్టీ అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అభ్యర్థులను ముందుగానే ప్రకటించడం ద్వారా వారికి ప్రచారానికి తగినంత సమయం ఇవ్వడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ రెండు జాబితాలతో కలిపి టీడీపీ ఇప్పటివరకు మొత్తం 58 స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

**ఖరారైన అభ్యర్థుల పూర్తి జాబితా:**

మున్సిపల్ కార్పొరేషన్ (1):
మచిలీపట్నం: షేక్ అబ్దుల్ అబిదా
మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు (21):
ఆకివీడు: నిలోఫర్ షేక్
బేతంచెర్ల: ఐ. లోకేశ్ గౌడ్
చీరాల: యెరిచర్ల హనీ స్పందన
బుచ్చిరెడ్డిపాలెం: దొడ్ల విజయలక్ష్మి
డోన్: కోట్ల సుజాతమ్మ
గుత్తి: గోవిందరాజులు తమిళ్ సెల్వి
గుంతకల్లు: యశోద
జంగారెడ్డిగూడెం: రొంగల అనుష
కదిరి: షేక్ సమీరా
కళ్యాణదుర్గం: బుట్న లక్ష్మి
కొండపల్లి: కన్నెకంటి అమూల్య
కొవ్వూరు: జొన్నలగడ్డ రాధారాణి
నాయుడుపేట: షకీరా
నందిగామ: శాకమూరి వంశీధర్
నందికొట్కూరు: ఈ.ఎం. సబురున్నిసా
నర్సీపట్నం: చింతకాయల పద్మావతి
ప్రొద్దుటూరు: నంద్యాల రాఘవరెడ్డి
వెంకటగిరి: దొంతు శారద
ఉయ్యూరు: చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్
ఏలేశ్వరం: యార్లగడ్డ అక్షిత
ఎమ్మిగనూరు: మాచాని సునీత

ఈ జాబితాలో మహిళలకు, యువతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మున్సిపాలిటీలకు అభ్యర్థులను ప్రకటించడం ద్వారా అన్ని ప్రాంతాల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్నామనే సంకేతాలను పార్టీ పంపింది. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే అభ్యర్థులను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారంలోకి దిగాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది.

### దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం..

# ఐదుగురి పరిస్థితి విషమం

- మొదటి పేజి తరువాయి

వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది.ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు

కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది..
## కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలకు గూండా లైసెన్స్‌లు ఇచ్చి, వారికి అండగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని జగన్ ఆరోపించారు. "రాజకీయ హింసావాదిగా తన చరిత్రను మరోసారి చాటుకుంటూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను నడిపిస్తున్నారు. ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయలేని దుస్థితి సృష్టించారు" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులను పోలీసుల సమక్షంలోనే కత్తులు, కర్రలతో వెంటాడుతున్నారని, నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళ అభ్యర్థులను పోలీసులు అక్రమంగా ఎత్తుకెళుతున్నారని, ఇదే చంద్రబాబు మార్కు ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు.ఈ దాడుల్లో తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలు కూడా బాధితులయ్యారని జగన్ తెలిపారు. అభ్యర్థులకు ప్రపోజర్లుగా వెళ్లిన ఎంపీలపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయని, వారి చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కుని చించేశారని వివరించారు. "ఎంపీలకే రక్షణ లేని రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏమిటి?" అని నిలదీశారు. కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, రాయచోటి, పుంగనూరు, తిరుపతి, దర్శి, గురజాల సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇవి చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఎంతగా దిగజారిపోయిందో చూపుతున్నాయని అన్నారు.పులివెందులలో పోలీసులు జరిపిన కాల్పులు ప్రజాస్వామ్యంపై పేల్చిన తూటాలని, దీని వెనుక చంద్రబాబు కుట్ర ఉందని జగన్ ఆరోపించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారిపై పోలీసులు ఎందుకు దాడి చేశారని, ఎందుకు కాల్పులు జరిపారని ప్రశ్నించారు. "నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం ఎన్నికలా? ప్రతిపక్ష అభ్యర్థులను పోలీసులతో ఎత్తుకెళ్లడం ప్రజాస్వామ్యమా? ఎంపీలపైనే దాడులు చేయించడం రాజ్యాంగ పాలనా?" అని చంద్రబాబును ఉద్దేశించి జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు.

రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ఈ పరిస్థితుల్లో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "సూపర్ 6, సూపర్ 7ల మోసాలతో ప్రజలకు బాండ్లు ఇచ్చి మరీ మోసం చేసిన ఈ వెన్నుపోటు పార్టీ నుంచి ఇంతకన్నా ఏమి ఆశించగలం!" అని జగన్ తన పోస్టును ముగించారు.

# సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- మొదటి పేజి తరువాయి

విఘాతం కలిగించకూడదన్న షరతుకు ఆయన కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన యాత్రకు ముందు, శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఆయనను ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ నిరసన యాత్రకు ముందు సుమారు 20 మందికి పైగా పోలీసులు దీప్కే నివాసానికి వెళ్లి ఆయనకు రెండు నోటీసులు అందజేశారు. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం వల్ల తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున అక్కడ నిరసనలు చేపట్టరాదని ఒక నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమర్పించిన బాండ్ షరతులను ఉల్లంఘిస్తున్నారని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన రెండో నోటీసులో పోలీసులు హెచ్చరించారు.

అక్టోబర్ 10న కూడా దీప్కే, ఆయన సహచరులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతియుతంగా

ఉంటామని హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రూ. 50,000 పూచీకత్తు సమర్పించి వారు విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'లెహ్రా దో తిరంగా' యాత్రను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున, ఢిల్లీ పోలీసులు ఈ యాత్రకు అనుమతి నిరాకరించారు.

## ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

- మొదటి పేజి తరువాయి

అనంతరం నేతలు కాసేపు ముచ్చటించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమ య్యారు. ఈ భేటీలో ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల కు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంపై మాట్లాడారు. అలాగే, జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను చీూ=కు తరలించే ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ సందర్భంగా త్వరలోనే తాను మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ తెలిపారు.సమావేశం అనంతరం పవన్ కల్యాణ్.. మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించి, కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. ప్రతిగా మోహన్ యాదవ్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్‌కు అందజేశారు.

# పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత

- మొదటి పేజి తరువాయి

ఒక్కసారిగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేతలను ముందుగా లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో వివాదం మొదలైంది. పోలీసుల నిర్ణయంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది.పరిస్థితి చేయిదాటిపోతుండటంతో గుంపును చెదరగొట్టి, శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొన్న తీవ్రమైన రాజకీయ పోటీయే ఈ ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. ఘటన అనంతరం పులివెందులలో భారీగా పోలీసులను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు.

# నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- మొదటి పేజి తరువాయి

దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!

- మొదటి పేజి తరువాయి

ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్-జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

# జగ్గంపేట విచ్చేసిన క్యాస్ట్ మూవీ హీరో గగన్ బాబు



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 17:** జగ్గంపేటలోని శ్రీ నాగేశ్వర థియేటర్ ను శనివారం క్యాస్ట్ మూవీ హీరో గగన్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా హీరో గగన్ బాబుకు థియేటర్ యజమాని కొత్త శివయ్య, బూర్లు సాయి సాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. నూతనంగా రాబోతున్న క్యాస్ట్ మూవీలో హీరోగా నేను నటించానని ఈ చిత్రాన్ని ప్రేక్షక దేవుళ్ళందరూ ఆదరించాలని హీరో గగన్ బాబు కోరారు. తాను ఇప్పటివరకు 30కి పైగా చిత్రాల్లో నటించానని, అతిపెద్ద చిత్రాలైనటువంటి పుష్ప, రాజా ది గ్రేట్, కృష్ణార్జున యుద్ధం, తదితర చిత్రాల్లో నటించడం జరిగిందని తెలియజేశారు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# టీడీపీ సీనియర్ల మధ్య అంతర్గత పోటీ?



**శంఖవరం పెన్ పవర్ అక్టోబరు17:-**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) పదవిని దక్కించుకోవాలనే లక్ష్యంతో కూటమి వర్గాల్లోనే సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నట్లు సమాచారం.

**ఎంపీపీ పదవిపై ఇద్దరు టీడీపీ సీనియర్ల గురి!**

శంఖవరం మండలంలో సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతూ తమకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఇద్దరు సీనియర్ టీడీపీ నాయకులు ఎంపీటీసీ సభ్యులుగా పోటీ చేసి, తదనంతరం ఎంపీపీ పదవిని దక్కించుకోవాలని వ్యూహరచన చేస్తున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఇద్దరు నాయకులు ఎవరనే విషయంపై అధికారిక స్పష్టత లేదు. అభ్యర్థుల ఎంపిక, పార్టీ మద్దతు,గెలుపు అవకాశాలు వంటి అంశాలు రానున్న రోజుల్లో కీలకంగా మారనున్నాయి.

**సీనియర్ నేత కనుసన్నల్లో అభ్యర్థుల ఎంపిక?**

మండలంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఓ సీనియర్ నాయకుడి కనుసన్నల్లో స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన చర్చలు సాగుతున్నట్లు సమాచారం. గ్రామాల వారీగా పార్టీ బలాబలాలు, నాయకుల వ్యక్తిగత ప్రభావం, స్థానికంగా ఉన్న సామాజిక సమీకరణాలు, కార్యకర్తల మద్దతు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**కూటమి పార్టీల మధ్య సర్దుబాట్లే కీలకం!**

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు కేటాయించాలి? ఎవరికి అవకాశం కల్పించాలి? ఆశావహుల్లో ఎవరికి పార్టీ అండగా నిలవాలి? అనే అంశాలపై కూటమి నాయకత్వం తీసుకునే నిర్ణయాలు ఎన్నికల వ్యూహాన్ని ప్రభావితం చేయనున్నాయి. ఒకే స్థానానికి పలువురు పోటీ పడితే వారిని సమన్వయం చేయడం పార్టీ నాయకత్వానికి సవాలుగా మారే అవకాశం ఉంది.

**రిజర్వేషన్లు, గెలుపు అవకాశాలే నిర్ణయాత్మకం!**

ఎంపీపీ పదవిని ఆశిస్తున్న నాయకులకు ముందుగా ఎంపీటీసీ స్థానంలో పోటీ చేసే అవకాశం రావడం, ఆ స్థానం రిజర్వేషన్‌కు అనుకూలంగా ఉండడం, ఎన్నికల్లో విజయం సాధించడం వంటి అంశాలు కీలకం కానున్నాయి. అంతేకాకుండా ఎంపీపీ పదవి రిజర్వేషన్, ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల మద్దతు, పార్టీ అంతర్గత నిర్ణయాలు కూడా పదవి ఎవరికి దక్కుతుందనే విషయాన్ని నిర్ణయించనున్నాయి. ప్రస్తుతం శంఖవరం మండలంలో అభ్యర్థుల ఎంపికపై జరుగుతున్న చర్చలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఆశావహుల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయి? ఇద్దరు సీనియర్ టీడీపీ నాయకుల్లో ఎవరికి పార్టీ అధిష్ఠానం మద్దతు లభిస్తుంది? ఎంపీపీ పీఠం దిశగా ఎవరు పైచేయి సాధిస్తారు? అన్నది రానున్న పరిణామాల్లో తేలాల్సి ఉంది.



## పెదశంకర్లపూడిలో వైభవంగా బోనాలు ఊరేగింపు,
## భక్తి శ్రద్దలతో అగ్నిగుండం తొక్కిన భవానీ భక్తులు

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 17:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలోని కొత్తూరు రామాలయం వద్ద శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురుభవానీ పత్రి రమణ సమక్షంలో శుక్రవారం బోనాల ఊరేగింపు,అగ్నిగుండం కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం అమ్మవారి సన్నిధిలో అగ్నిగుండం కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో భవాని మాలలు ధరించిన భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తుల జైజైకారాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



## గోవింద నామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల వాడపల్లి

**వెంకన్న దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు.. వైభవంగా నిత్య సేవలు**

**భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారుల ఏర్పాట్లు.. పోలీసుల పటిష్ట బందోబస్తు**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 17** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధి శనివారం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. చందన స్వరూపుడిగా, అలివేలు మంగ, పద్మావతి సమేతంగా కొలువుదీరిన కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనంతో మనసారా పులకించిపోయిన భక్తులు గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలను మార్మోగించారు. శనివారం వేకువజామునే ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి మేలుకొలుపు సేవ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, సుప్రభాత సేవ, అలంకరణోత్సవాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ సాగిన పూజా కార్యక్రమాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. స్వామివారి అలంకారాన్ని కనులారా తిలకించిన భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ ఆడవీధుల్లో భక్తులు ఏడు ప్రదక్షిణలు చేస్తూ గోవిందా.. గోవిందా అంటూ చేసిన నామస్మరణతో వాడపల్లి క్షేత్రం ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. అనంతరం ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ సన్నిధిలో నిర్వహించిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారగా, స్వామివారి దర్శనం కోసం భక్తులు క్రమపద్ధతిలో బారులు తీరారు.

**భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

వాడపల్లి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు సజావుగా స్వామివారిని దర్శించుకునేలా క్యూలైన్ల నిర్వహణతో పాటు అవసరమైన సదుపాయాలపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**పోలీసుల పటిష్ట బందోబస్తు**

భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, ఆలయ పరిసరాల్లో భద్రతకు విఘాతం తలెత్తకుండా ఆత్రేయపురం ఎస్ఐ రాము తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలు చేపట్టారు.మొత్తంగా శనివారం వాడపల్లి వెంకన్న సన్నిధి భక్తుల గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోగా, స్వామివారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో కోనసీమ తిరుమల క్షేత్రం కళకళలాడింది.

# ఏలేశ్వరం మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను
## క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్.



**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబరు17:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేందిర ప్రసాద్ ఏలేశ్వరం శనివారం విచ్చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ ఏలేశ్వరం నగర మున్సిపాలిటీలో ఎన్నికల సన్నాహకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలు అధికారులతో కలిసి పరిశీలించారు. వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్స్, స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను వివరంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ స్వీకరణ కేంద్రాల వద్ద సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సామాగ్రిని త్వరితగతిన, క్రమబద్ధంగా అందించేందుకు వీలుగా ప్రత్యేక వరుసలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం సామాగ్రిని సేకరించే సమయంలో ఏ విధమైన ఆలస్యం జరగకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, సిబ్బంది సౌకర్యార్థం తాగునీరు, ప్రాథమిక వైద్యం, భోజన వసతి, తగినంత గాలి, వెలుతురు ఉండేలా అన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోలింగ్ పెట్టెలు లేదా యంత్రాలను భద్రపరిచే భద్రతా గదుల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతర నిఘా కోసం స్ట్రాంగ్ రూమ్ వద్ద కెమెరాలు అమర్చి విరామం లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ యంత్రాలను అందుబాటులో ఉంచాలని, అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు అగ్నిమాపక భద్రతా పరికరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని అధికారులను హెచ్చరించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా లెక్కింపు బల్లల అమరిక, లెక్కింపు ఏజెంట్లు, సిబ్బంది రాకపోకలకు వేర్వేరు మార్గాల ఏర్పాటుపై కలెక్టర్ సమీక్షించారు. ఎన్నికల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, రెవెన్యూ, పోలీస్, పురపాలక శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అత్యంత సమర్థ వంతం గా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కమిషనర్ ఏఎన్ జ్ఞాన్ ప్రకాష్, టిపిఓ ఎస్ వినయ్ ప్రసాద్, స్థానిక అధికారులు, ప్రత్తిపాడు సీఐ బి. సూరి అప్పారావు, ఏలేశ్వరం ఎస్సై ఎన్ రామలింగేశ్వర రావు, ప్రతిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఏలేశ్వరంలో రికార్డు స్థాయిలో భారీ వర్షం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** అంచనాలను మించిన వాతావరణ పరిస్థితుల్లో భానుడి ప్రతాపానికి విలవిల్లాడుతున్న ప్రజానీకానికి శనివారం ఏలేశ్వరంలో రికార్డ్ స్థాయిలో కురిసిన భారీ వర్షానికి ఉష్ణతాపం నుంచి ప్రజలకు ఊరట లభించింది. సుమారు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం 3.30 గంటల వరకు ఏకధాటిగా కురిసింది. ఒంటిగంట ప్రాంతంలో తీవ్రమైన ఉక్క పోత తో ప్రజలను ఉక్కరి బిక్కరి చేసిన తర్వాత ఏ విధమైన ఈదురుగాలి లేకుండా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలో వీధులన్నీ జలమయమై కాలువల్లో మురుగునీరుతో వీధులు రోడ్లపై ప్రవహించాయి. ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రయాణికులు 2.30 గంటల సేపు చాలా ఇబ్బందులు పడ్డారు. 2026 సంవత్సరానికి రికార్డు స్థాయిలో భారీ కుండపోత వర్షం కురిసిందని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికల డ్యూటీల కారణంగా వర్షపాత నమోదు వివరాలు వర్షపాత గణాంకాలు తెలిపే అధికారులు అందుబాటులో లేరు.

# దసరా కానుకగా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, దుప్పట్లు పంపిణీ

* పండుగ వేళ కార్మికులకు అండగా శ్యామ్ జాదూగర్ కుటుంబ సభ్యులు



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 17:**దసరా పండుగను పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్యామ్ జాదూగర్ కుటుంబ సభ్యులు తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి కార్మికులకు దసరా కానుకలు అందజేశారు. పండుగ వేళ పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయంగ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం కృషి చేస్తున్నారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు వారు చేస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి, వారిని గౌరవించాలని సూచించారు.

### పండుగ వేళ సాయం అందించడం ఆనందంగా ఉంది

దసరా వంటి పర్వదినాల్లో ప్రతి కుటుంబం సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో పారిశుద్ధ్య కార్మికులకు తమ వంతు సహాయం అందించినట్లు శ్యామ్ జాదూగర్ కుటుంబ సభ్యులు తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా కార్మికులకు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, పురుష కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పండుగ వేళ అందించిన కానుకలతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా అవసరమైన వారికి సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహిత్, సీత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## చినశంకర్లపూడిలో భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి బోనాల పండుగ.

* ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,అక్టోబర్,17:**దేవి నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు మండలం, చిన శంకర్లపూడి గ్రామంలో శ్రీ దుర్గాదేవి అమ్మవారి బోనాల పండుగ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభరాజా ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభరాజా మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు.దేవి నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు మన సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారుద

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

* పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, అక్టోబర్ 17 పెన్ పవర్:** జిల్లాలో రాబోయే రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను శనివారం జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావుతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కళాశాల ప్రాంగణాన్ని సమగ్రంగా తనిఖీ చేసి, బ్యాలెట్ బాక్సుల భద్రతకు కేటాయించే గదులు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు, ప్రవేశ మార్గాలు, ఇతర అవసరాలపై చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటల పోలీసు బందోబస్తు కల్పించాలని సూచించారు. అవసరమైన సాంకేతిక సదుపాయాలను అందుబాటులో ఉంచి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ఎన్నికల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మందేశ్వర స్వామి ఆలయానికి రూ.2.20 లక్షల ఆదాయం

**కొత్తపేట,పెన్ పవర్,అక్టోబర్ 17:**కొత్తపేట మండలం మందపల్లిలో కొలువైన శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానానికి శనివారం వివిధ పూజలు, విరాళాల ద్వారా రూ.2,20,205 ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.స్వామివారికి నిర్వహించిన ప్రత్యక్ష పూజల ద్వారా రూ.1,17,190, పరోక్ష (ఆన్‌లైన్) పూజల ద్వారా రూ.82,100, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.20,915 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. ముఖమండప తైలాభిషేకం, ఏకాదశ రుద్ర తైలాభిషేకం, మహాన్యాస పూర్వక తైలాభిషేకం, తైలం సమర్పించి దర్శనం, తిలదానం, స్వయంహోమం, కేశఖండన తదితర సేవల ద్వారా ప్రత్యక్ష ఆదాయం సమకూరినట్లు వివరించారు.

# ర్యాలిలో జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

* వైభవంగా విశిష్ట పూజలు.. భక్తులకు అన్నప్రసాద వితరణ




**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 17:**ర్యాలి గ్రామంలో కొలువుదీరిన అత్యంత పురాతనమైన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని దివ్య ఆశీస్సులు పొందుతున్నారు. శనివారం స్వామివారి సన్నిధిలో ఆలయ అర్చకులు విశిష్ట పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఐదు బుధవారాల జగన్మోహిని కేశవస్వామి దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

### భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం

ర్యాలి గ్రామానికి చెందిన భక్తులు ఆలయ సన్నిధిలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం, మణిద్వీప పారాయణం నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పారాయణ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

### భక్తులకు మెరుగైన సదుపాయాలు

ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన స్వామివారి దర్శనం కల్పించడంతో పాటు అన్నప్రసాద వితరణ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా ఆలయ పరిసరాల్లో అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నట్లు వారు వివరించారు.

## స్థానిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించడమే లక్ష్యం

* కూటమి సమష్టి విజయానికి కార్యాచరణ ప్రణాళిక.. మంత్రి వాసంశెట్టి సుభాష్
* సంక్షేమమే ప్రధాన అజెండా: ఎంపీ సానా సతీష్



**రామచంద్రపురం, పెన్ పవర్,అక్టోబర్ 17 :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఐక్యంగా ముందుకు సాగి 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కూటమి ప్రభుత్వ పనితీరు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే ఎన్నికల్లో తమకు ప్రధాన బలమని పేర్కొన్నారు.రామచంద్రపురంలో శనివారం మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి, కార్యదర్శి గంధం పల్లంరాజు, కూటమి సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకురాలు మజ్జి పద్మావతి తదితరులు సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, మూడు పార్టీల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్‌రేట్ సాధించామని, ఈసారి అన్ని స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. కూటమిలో అక్కడక్కడా చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని పరస్పర చర్చలతో పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలను సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.70 కోట్లతో, నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.270 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, ఇతర ప్రజోపయోగ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధి, సంక్షేమంపై స్పష్టమైన కార్యాచరణను ప్రజల ముందు ఉంచకుండా భయపెట్టే వ్యాఖ్యలు చేస్తున్నాయని విమర్శించారు. రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూటమి తరపున మేడిశెట్టి శేషారావును ప్రకటించినట్లు మంత్రి సుభాష్ తెలిపారు. ఆయన విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

### అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండా: ఎంపీ సానా సతీష్

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. ఉన్నత విద్యావంతుడు, ప్రముఖ వ్యాపారవేత్త మేడిశెట్టి శేషారావును మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని 32 వార్డులకు సమర్థులైన అభ్యర్థులను బరిలో నిలిపామని పేర్కొన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీలోని అన్ని వార్డులతో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయకేతనం ఎగురవేస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు.మూడు పార్టీల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, అభ్యర్థుల విజయానికి బాధ్యతగా పనిచేయాలని సమావేశంలో నాయకులు నిర్ణయించారు.

## మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

* తుని, ఏలేశ్వరం ఎన్నికల సన్నాహాలను పరిశీలించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ/ఏలేశ్వరం, అక్టోబర్ 17 పెన్ పవర్:**జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం కలెక్టర్ తుని పురపాలక సంఘం, ఏలేశ్వరం నగర పంచాయతీల్లో ఎన్నికల సన్నాహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి అక్కడ చేపడుతున్న ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోలింగ్ సామగ్రిని త్వరితగతిన, క్రమబద్ధంగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక వరుసలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ ముగిసిన అనంతరం సామగ్రి స్వీకరణలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. సిబ్బందికి తాగునీరు, ప్రాథమిక వైద్యం, భోజన వసతి, తగినంత గాలి, వెలుతురు వంటి సౌకర్యాలను కల్పించాలని స్పష్టం చేశారు.

### స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ పెట్టెలు లేదా యంత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయాలను అందుబాటులో ఉంచడంతో పాటు అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

### పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. లెక్కింపు బల్లల అమరిక, కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది రాకపోకలకు వేర్వేరు మార్గాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని పేర్కొంటూ రెవెన్యూ, పోలీసు, పురపాలక శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో తుని, ఏలేశ్వరం పురపాలక అధికారులతో పాటు స్థానిక అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మందేశ్వర స్వామి ఆలయానికి రూ.2.20 లక్షల ఆదాయం



**కొత్తపేట,పెన్ పవర్,అక్టోబర్ 17:**కొత్తపేట మండలం మందపల్లిలో కొలువైన శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానానికి శనివారం వివిధ పూజలు, విరాళాల ద్వారా రూ.2,20,205 ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.స్వామివారికి నిర్వహించిన ప్రత్యక్ష పూజల ద్వారా రూ.1,17,190, పరోక్ష (ఆన్‌లైన్) పూజల ద్వారా రూ.82,100, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.20,915 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. ముఖమండప తైలాభిషేకం, ఏకాదశ రుద్ర తైలాభిషేకం, మహాన్యాస పూర్వక తైలాభిషేకం, తైలం సమర్పించి దర్శనం, తిలదానం, స్వయంహోమం, కేశఖండన తదితర సేవల ద్వారా ప్రత్యక్ష ఆదాయం సమకూరినట్లు వివరించారు.

## ఘనంగాఫస్ట్ షో సినిమా ఆడియో విడుదల.



-సినీ నటుడు కిర్లంపూడి రాంబాబు వెల్లడి.

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్,17:** ఫస్ట్ షో సినిమా ఆడియో విడుదల ఫంక్షన్ బుద్దవరం గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించినట్లు కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన నటుడు కర్రి శివరాం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగదీష్ కేకే దర్శకత్వంలో కిరణ్ కుమార్ రఘుపతి నిర్మించిన ఈ చిత్రంలో సూర్య భరత్ చంద్ర, ప్రియా దేశ్పాగ్, రాఖీ, రేణు కియారా, శివరాం, రాంబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారన్నారు.ఈ సినిమాలోని మూడు పాటలను ఈ సందర్భంగా విడుదల చేయడం జరిగిందన్నారు. హీరో అవ్వాలనే తపనతో హైదరాబాదులోని స్టూడియోల చుట్టూ తిరిగే ఓ యువకుడి జీవితంలో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంతో కథనం సాగుతుందని శివరాం తెలిపారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిలుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పారిశ్రామికవేత్త అయిన సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ, వేగి గోపినాథ్, వేగి అప్పలనాయుడు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారని శివరాం ఈ సందర్భంగా తెలిపారు.

# ఆదిత్య విశ్వ విద్యాలయం, స్కూల్ అఫ్ బిజినెస్ లో ముగిసిన ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్స్

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 17** గండేపల్లి మండలం, సూరంపాలెం లోని స్థానిక ఆదిత్య విశ్వ విద్యాలయం, స్కూల్ అఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'పవర్ బిఐ ఎస్సెంషియాల్స్ : డేటా టు డాష్ బోర్డు' అనే అంశం పైన (అక్టోబర్ 12 నుండి 16 వ తేదీ వరకు) 5 రోజుల పాటు ఆన్లైన్ శిక్షణ విజయవంతంగా, విజ్ఞానదాయకంగా ముగిసినట్లు విశ్వవిద్యాలయం ప్రో-వైస్ ఛాన్సలర్ (ా ఛూ ), డా. రవి తంగజం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పవర్ బిఐ ఎకో - సిస్టం హాండ్స్ ఆన్ : లోడ్ ఏ సింపుల్ డేటా సెట్ , డేటా విజువలైజషన్ డేటా మోడలింగ్ కాన్సెప్ట్స్ , ఫండమెంటల్స్ అఫ్ దాస్ మరియు పబ్లిషింగ్ అండ్ షేరింగ్ వంటి అంశాలపై శిక్షణ (తర్ఫీదు) ఇచ్చారని తెలిపారు. ఈ ఆన్లైన్ సర్టిఫికేషన్ కోర్స్ రిసోర్స్ పర్సన్స్ గా డా. కిరణ్మయి అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. ఆకొండి శ్రీకాంత్ , అసోసియేట్ ప్రొఫెసర్, స్కూల్ అఫ్ బిజినెస్ నుండి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి , ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డా. ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ఆదిత్య యూనివర్సిటీ, స్కూల్ అఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డా.



సౌజన్య, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కో-ఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ డా. వి. వెంకటేశ్వరావు తో పాటుగా విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# కాంగ్రెస్ పార్టీ మున్సిపాల్ పోటీలో చైర్మన్ అభ్యర్థినిగా ఏడిద లోవలక్ష్మి ఖరారు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**ఏలేశ్వరం మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిని గా ఏడిద లోవలక్ష్మి పేరును కాంగ్రెస్ పార్టీ శనివారం ఖరారు చేసింది. ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు స్థానిక షిరిడి నగర్ లో మీడియా సమావేశం నిర్వహించి చైర్ పర్సన్ గా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఏడిద లోవ లక్ష్మి పేరును ప్రకటించారు.ఈ సందర్భంగా వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ మాజీమంత్రి పల్లం రాజు,మాజీ ఎంపీ హర్ష కుమార్ ఆదేశాల మేరకు ఏలేశ్వరం మున్సిపాలిటీ ఎన్నికల బరిలో కాంగ్రెస్ అభ్యర్థులను నిలిపేందుకు రంగం సిద్ధం చేశామన్నారు.ఆదివారం నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు స్థానిక షిరిడినగర్ పార్టీ కార్యాలయం నుండి నామినేషన్ వెయ్యడానికి బయలుదేరడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్య ప్రకాశరావు,రామకుర్తి సూర్యనారాయణ,గుణాపు శ్రీను, దొంతంశెట్టి చంద్రశేఖర్,ఆలేటి అనిల్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గండేపల్లిలో వైభవంగా శ్రీశ్రీ కనకదుర్గమ్మ పడిపూజ

### అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారి పడి వెలిగించిన భవానీలు

### 18 మెట్ల విశిష్టతను వివరించిన వేద పండితులు



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 17** మండల కేంద్రమైన గండేపల్లి గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా శ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని కృష్ణుడు గుడి వద్ద భవానీ మాలధారణ వేసిన భవానీలు ఏకమై ఈ పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

?ఈ సందర్భంగా వేద పండితులు పాల్గొని దుర్గమ్మ వారి 18 మెట్ల ప్రాశస్త్యాన్ని, అష్టాదశ శక్తిపీఠాల విశిష్టతను భక్తులకు వివరంగా తెలియజేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ భవానీ దీక్షాధారులు శ్రద్ధాభక్తులతో అమ్మవారి పడిని వెలిగించారు.?కడియం నుంచి తెప్పించిన ప్రత్యేక సువాసన పూలతో పూజా మండపాన్ని అత్యంత సుందరంగా, నేత్రపర్వంగా అలంకరించారు. అనంతరం నిర్వహించిన భజన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సంకీర్తనలతో గండేపల్లి గ్రామం దుర్గానామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భవానీ మాలధారులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు

# సి.రాయవరంలో శ్రీ దుర్గామాత ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** మండల పరిధి సి. రాయవరం గ్రామంలో శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ దుర్గా మాత మండపం ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు.నవరాత్రులు పురస్కరించుకుని గ్రామంలోని శ్రీ దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం వంటి విశేష పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయానికి విశేషంగా తరలివచ్చారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం నవ దుర్గామాతల నామస్మరణలతో ఆ ప్రాంతంమార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ , గ్రామ పెద్దల సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 1500 మందికి భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పోతుల రాజరాజేశ్వరి, పోతుల రామ్ లక్ష్మణ్, పోతుల భవాని, పోతుల ప్రసాద్, పోతుల సాయి వెంకట్ రాజ్, ఎల్ లోవరాజు, బి శివ, దారా వినయ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు పెద్ద పాల్గొన్నారు.

# రంపచోడవరంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి శంకుస్థాపన

- ప్రత్యేక పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టిన జిల్లా ఎస్పీ చక్రవర్తి
- నూతన పోలవరం జిల్లాలో పోలీస్ శాఖ మౌలిక వసతుల కల్పనకు ముందడుగు
- కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ ఉన్నతాధికారులు



**గంగవరం /రంపచోడవరం, అక్టోబర్ 17 (పెన్ పవర్):**నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లాలో పోలీస్ శాఖ పరిపాలనా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. జిల్లా కేంద్రంగా ఉన్న రంపచోడవరంలో నూతన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) కార్యాలయ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయ నిర్మాణ పనులకు లాంఛనంగా శ్రీకారం చుట్టారు.నూతన జిల్లా ఏర్పాటుతో పోలీస్ శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చారణల నడుమ సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**పోలీస్ పరిపాలనకు మరింత సౌలభ్యం**

పోలవరం జిల్లా ఏర్పాటుతో జిల్లా స్థాయిలో పోలీస్ పరిపాలనా కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక కార్యాలయ అవసరం ఏర్పడింది. నూతన ఎస్పీ కార్యాలయం అందుబాటులోకి వస్తే పోలీస్ శాఖకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలు, శాంతిభద్రతల పర్యవేక్షణ, వివిధ విభాగాల మధ్య సమన్వయం మరింత సులభతరం కానున్నాయి. అంతేకాకుండా ప్రజలకు పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించేందుకు కూడా సౌకర్యవంతంగా ఉండనుంది.

**పాల్గొన్న పోలీస్ ఉన్నతాధికారులు**

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) జవాలీ, రంపచోడవరం ఎస్డీపీఓ అష్రోఫ్ అలీ, ఏఆర్ డీఎస్పీ సీతారాం, సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేంద్ర ప్రసాద్, ఎస్సై రమేష్, ఏపీ పోలీస్ హౌసింగ్ ఏఈ తేజస్ తదితరులు పాల్గొన్నారు.నూతన పోలవరం జిల్లాలో పోలీస్ శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

**కాకినాడ, అక్టోబర్ 17 పెన్ పవర్:** రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఈ నెల 14వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని అర్జీదారులు, ప్రజలు గమనించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ కోరారు.

# తోమాల సేవకులకు జనార్ధనస్వామి చిత్రపటం అందజేత




**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 17:**మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధన స్వామి వారి ఆలయంలో అశ్వయుజ శుద్ధ సప్తమి శనివారం స్వామివారికి తోమాల సేవ, ఆలయానికి తరలివచ్చిన యాత్రికులకు ప్రసాద వితరణ సేవలందించిన ఏపీటిఎఫ్ మండల అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, వెంకట జ్యోతి దంపతులు, వారి కుమారులు సాయి విద్యాధర్, శశాంక్ సూర్య వర్షిత్ లకు ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. స్వామివారికి తోమాల సేవ నిర్వహించడంతో పాటు యాత్రికులకు ప్రసాద వితరణ కార్యక్రమాల్లో విశేష సేవలు అందించినందుకు గాను అద్దరి దంపతులను చైర్మన్ రాంబాబు ఈ సందర్భంగా అభినందించారు.

# సరస్వతీదేవి అలంకరణలో పెదపళ్ళ దుర్గమ్మవారు

- ఘనంగా చిన్నారుల చేతుల మీదుగా సరస్వతీ పూజలు



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 17:**పెదపళ్ళ పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన దుర్గమ్మ మండపంలో శనివారం ఉదయం సూర్యోదయ సమయ మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.ఒక చేతిలో వీణ, మరో చేతిలో జపమాలతో, శ్వేత వస్త్రాలు ధరించి శుద్ధ జ్ఞానైకమూర్తిగా అనుగ్రహిస్తున్న అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిన్నారుల చేత అర్చకులు పాలంకి వేంకట నరసింహారావు సరస్వతీ పూజలు చేయించారు. గత 19 సంవత్సరాలుగా విశేషంగా ఈ మండపంలో ఆరాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# భక్త జనసందోహంతో కిటకిటలాడిన ఆలమూరు జనార్దన స్వామి ఆలయం

### జయ జనార్దన గోవిందా.. నవ జనార్దన నారాయణా నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 17:**నవ జనార్దన క్షేత్రాల్లో నాలుగవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారి ఆలయం శనివారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. ఆశ్వయుజ శుద్ధ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన జనార్దన స్వామివారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో నిండిపోగా, 'జయ జనార్దన గోవిందా.. నవ జనార్దన నారాయణా' అనే నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. భక్తులకు అర్చకులు అంగర భగవానాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

**భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి**

స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, కార్యనిర్వహణాధికారి (ఈవో) నరేంద్ర కుమార్, పాలకమండలి సభ్యులు, సేవా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ఆలయం వెనుక భాగంలోని షెడ్డులో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. పర్వదినం సందర్భంగా ఆలయంలో నెలకొన్న భక్తి వాతావరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు!

- ఎన్నికల బాధ్యతలను చట్టబద్ధమైన కర్తవ్యంగా భావించాలి
- ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ
- రెవెన్యూ, పోలీస్ శాఖల మధ్య పటిష్ట సమన్వయం అవసరం
- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టీకరణ




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు ఏమాత్రం అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని పోలవరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ హెచ్చరించారు. ఎన్నికల విధులను చట్టబద్ధమైన బాధ్యతగా భావించి ప్రతి అధికారి సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులకు తొలుత షోకాజ్ నోటీసులు జారీ చేసి, అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా సమావేశంలో జిల్లా ఎస్పీ కె. చక్రవర్తితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి**

స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ ప్రతి దశలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో సివిల్ అడ్మినిస్ట్రేషన్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య నిరంతర సమాచార మార్పిడి జరగాలని ఆదేశించారు.

**నామినేషన్ల పరిశీలనలో నిబంధనలు పాటించాలి**

రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) ఎన్నికల ప్రక్రియలో తమ పాత్రలు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఆమోదం, తిరస్కరణ వంటి అంశాల్లో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. నిర్ణీత గడువుల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని, ఎటువంటి వివాదాలకు తావులేకుండా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ సవాళ్లతో కూడుకున్నదని కలెక్టర్ పేర్కొన్నారు. భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాల కొరత, సమయ పరిమితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు (ఎఫ్ఎస్టీ), స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు (ఎస్ఎస్టీ), రూట్ అధికారులు, జోనల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ఆదేశాలు**

ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**సమస్యలు తలెత్తకముందే అప్రమత్తం కావాలి: జిల్లా ఎస్పీ**

ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న తర్వాత స్పందించడం కంటే ముందస్తు సమాచారంతో వాటిని నివారించడమే ముఖ్యమని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు తమ పరిధిలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పోలీస్ శాఖతో సమాచారాన్ని పంచుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా ప్రశాంత ఎన్నికల నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని స్పష్టం చేశారు.

**చీకటి పడకముందే ఎన్నికల సామగ్రి తరలింపు**

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో సమయపాలన అత్యంత కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చీకటి పడకముందే మారుమూల ప్రాంతాల నుంచి సురక్షితంగా బయటకు వచ్చేలా రవాణా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఇందుకోసం పోలీస్, రెవెన్యూ, ఎన్నికల అధికారుల మధ్య సమన్వయం తప్పనిసరని స్పష్టం చేశారు.

**ఎన్నికల శిక్షణపై అధికారులకు దిశానిర్దేశం**

ఈ సమావేశంలో ఎన్నికల శిక్షణ ప్రణాళిక, అధికారుల విధులు, బాధ్యతలు, శిక్షణ షెడ్యూల్, ఎన్నికల సామగ్రి, శిక్షణా వేదికలు, ఇతర ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్లు పృథ్వీ రాజ్ కుమార్, నరేంద్ర పడాల్, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, జడ్పీ సీఈవో పురుషోత్తం, ఓ ఎస్ డి జవాళి ,సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అష్రాఫ్ ఆలీ, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటే లక్ష్యం!

- సూర్య ఘర్ పథకంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు
- సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ
- పథకం ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**పోలవరం జిల్లాలో ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయించి, ప్రజలకు సౌర విద్యుత్ ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావడమే సేవా సేతు అభియాన్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, సబ్ కలెక్టర్లు పృథ్వీ రాజ్ కుమార్, నరేంద్ర పడాల్, డీఎస్పీ అస్రఫ్ ఆలీలతో కలిసి సేవా సేతు అభియాన్, పీఎం సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజన పథకానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

**విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. సౌర విద్యుత్ వినియోగం వల్ల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.

**అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం చేరాలి**

సేవా సేతు అభియాన్ ద్వారా పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పథకం ప్రయోజనాలు, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు విధానం, అర్హతలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ అవసరాలను తీర్చుకునేందుకు అవకాశం ఉంటుందని, ప్రజలు సౌర విద్యుత్ వినియోగం వైపు మొగ్గుచూపాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ అచ్చుతారావు, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై

# సంపూర్ణ అవగాహనతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి




**పెన్ పవర్ -- భీమవరం, అక్టోబర్ 17:**అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అత్యంత అప్రమత్తతతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఎన్నికల సమయంలో జిల్లాలో ఎక్కడ చిన్న సమస్య తలెత్తినా, అది మొత్తం ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సమన్వయంతో, జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఎన్నికల విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 3వ తేదీన పోలింగ్, నవంబర్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల నిర్వహణకు సుమారు 7,500 మంది సిబ్బంది అవసరమవుతారని తెలిపారు. విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరికీ తమ బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.గతంలో పలుమార్లు ఎన్నికల విధులు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రతి ఎన్నికను ప్రత్యేకమైనదిగా భావించి మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, విధివిధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలు, అధికార పరిధి, అనుసరించాల్సిన విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణలో వివరించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.

**ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రతి అధికారి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో సున్నితమైన అంశాలు, ప్రజల భావోద్వేగాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ఏజెంట్లకు నిబంధనల ప్రకారం అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయడంతోపాటు, ఎన్నికలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

**శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించాలి**

ఎన్నికల విధులపై శిక్షణ అందించే ట్రైనర్లు ప్రతి నియమాన్ని, విధివిధానాన్ని స్పష్టంగా వివరించాలని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో సంబంధిత మండల అధికారులు, ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల నిర్వహణలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు.పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి, సిబ్బంది పూర్తి నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ పి. ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

- దేవాలయాల ఆస్తుల పరిరక్షణ, పారదర్శక పాలనకు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**పెన్ పవర్ । భీమవరం । అక్టోబర్ 17:**పశ్చిమ గోదావరి జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ దేవాదాయ శాఖ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.జిల్లా ఎండోమెంట్ అధికారిగా నియమితులైన వి. వెంకటేశ్వరరావు శనివారం భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.వి. వెంకటేశ్వరరావు గతంలో కాకినాడ జిల్లాలో విధులు నిర్వహించగా, అక్కడి నుంచి భీమవరం జిల్లా ఎండోమెంట్ అధికారిగా బదిలీపై వచ్చారు. ఇంతకుముందు పశ్చిమ గోదావరి జిల్లా ఎండోమెంట్ అధికారిగా పనిచేసిన సూర్య ప్రకాష్, మావుళ్లమ్మ తల్లి ఆలయ కార్యనిర్వహణాధికారిగా బదిలీ అయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధితో పాటు వాటి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. దేవాదాయ శాఖలో పారదర్శకమైన పాలనకు ప్రాధాన్యతనిస్తూ, భక్తులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

# శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు

- ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- వేదమంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజలు



**గంగవరం, అక్టోబర్ 17 (పెన్ పవర్):**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గంగవరం గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ దేవి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఆలయ పురోహితులు శ్రీ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లోకకల్యాణం, సుఖశాంతులు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. మహాలక్ష్మీ దేవి రూపంలో దర్శనమిచ్చిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

**భక్తిపారవశ్యంలో అమ్మవారి ఆలయం**

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తిపూర్వక వాతావరణం నెలకొంది. జగన్మాతను వివిధ రూపాల్లో ఆరాధించడం ద్వారా అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా శ్రీ మహాలక్ష్మీ దేవిని ఐశ్వర్యానికి, సౌభాగ్యానికి, సుఖసంతోషాలకు అధిష్ఠాన దేవతగా కొలుస్తారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

**సిరిసంపదలు ప్రసాదించే మహాలక్ష్మీ అమ్మవారు**

శ్రీ మహాలక్ష్మీ దేవి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శించుకోవడం పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. అమ్మవారి ఆరాధనతో సకల శుభాలు కలుగుతాయని ఆలయ పురోహితులు శ్రీ వెంకటేశ్వర శర్మ వివరించారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలతో గంగవరం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో కొలువుదీరిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దివ్య దర్శనం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది.

# ఎన్నికల ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ

డి ఆర్వో భాస్కర్ రెడ్డి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి కంట్రోల్ రూమ్ విధులకు కేటాయించిన సిబ్బందితో సమావేశం నిర్వహించి, విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తుందని, ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, సంబంధిత అధికారులకు సమాచారం చేరవేత, పరిష్కార పురోగతిపై పర్యవేక్షణ బాధ్యతలను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుదారుల పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఫిర్యాదు అందిన తేదీ, సమయం తదితర వివరాలను రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేసి, వెంటనే కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

సంబంధిత రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. సిబ్బంది తమకు కేటాయించిన షిఫ్టుల ప్రకారం విధులకు హాజరుకావాలని, విధుల లో మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ఆదేశాలను ఉల్లంఘించినా నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంట్రోల్ రూమ్ నిర్వహణకు నోడల్ అధికారిగా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్. సుభాషిణిని నియమించగా, కలెక్టరేట్ పీజీఆర్ఎస్ డిప్యూటీ తహసీల్దార్ హెచ్. శ్రీరామ్ సహకరించ నున్నారు. కంట్రోల్ రూమ్ సిబ్బందికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రెండో షిఫ్ట్, రాత్రి 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మూడో షిఫ్టులలో విధులు కేటాయిం చారు. ఎన్నికల కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08832-944455

# నగరపాలక ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి

✸ కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** నగరపాలక ఎన్నికల నోటిఫికేషన్ ఏక్షణంలో వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత తక్కువ సమయంలోనే ప్రక్రియ పూర్తిచేయవలసి ఉంటుందని, ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తి చేసుకోవలసిందిగా సూచించారు. నోటిఫికేషన్‌కు ముందే అవసరమైన పనులు చేపడితే ఎన్నికల సమయంలో ఇబ్బందులు తగ్గుతాయని, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిర్దేశకాలపై అధికారులు, ఉద్యోగులు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. పునర్విభజన జరిగిన వార్డుల వారీగా ఇంటింటికి తిరిగి పక్కా ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించాలన్నారు. బ్యాలెట్ పెట్టెల ద్వారా ఎన్నికలు జరగనున్నందున ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నగరంలో పోలింగ్ స్టేషన్లను గుర్తించడంతో పాటు వాటిలో మౌలిక వసతులు కల్పించవలసి ఉందని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. ప్రతి పోలింగ్‌బూత్‌లో 1000 మంది ఓటర్లు ఉండేలా చూడాలని, ప్రతి ఓటరు నివాసం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య, పురపాలక శాఖ పాఠశాలలతో పాటు ప్రభుత్వ భవనాలు, వార్డు సచివాలయాలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అధికారులు దృష్టి సారించాలన్నారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చూడాల న్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని, విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్లు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో, అనంతరం చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సమీక్షలో సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జగ్గంపేట అసెంబ్లీ స్థానిక ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా మహిపాల గణేష్.



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 17:-** కాకినాడ పార్లమెంట్ పరిధిలో జగ్గంపేట నియోజకవర్గ స్థానిక ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ లో నిర్వాహకదళ్ సభ్యులుగా గోకవరం జనసైనికుడు మహిపాల వీర వెంకట సత్య నారాయణ(గణేష్) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా మహిపాల గణేష్ మాట్లాడుతూ సాధారణ కర్యకర్తకు జనసేన పార్టీ ఇంతటి సముచిత స్థానం కల్పిస్తుందని ఊహించనే లేదని పార్టీ కోసం కష్టపడి పనిచేశానే తప్ప ఏనాడు పదవుల కోసం చూడలేదన్నారు. అయినప్పటికీ జనసేన పార్టీ నన్ను గుర్తించి, ఇంతటి బాధ్యతను తనకు అప్పగించడం చాలా సంతోషకరంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ కు, జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని గ్రామీణ స్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మహిపాల వీర వెంకట సత్యనారాయణ (గణేష్) తెలిపారు.

# అగ్నివీర్ నియామక ర్యాలీని అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలి

## భారత సైన్యంలో సేవలందించే అవకాశాన్ని యువత వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**పెన్ పవర్ -- భీమవరం । అక్టోబర్ 17:**భీమవరం, అక్టోబర్ 17: భారత సైన్యంలో అగ్నివీర్‌గా చేరాలనుకునే అర్హులైన యువత హైదరాబాద్‌లోని ఆర్టిలరీ సెంటర్‌లో నిర్వహించనున్న యూనిట్ హెడ్‌క్వార్టర్స్ కోటా నియామక ర్యాలీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. 2026 నవంబర్ 25 నుంచి డిసెంబర్ 6 వరకు ఈ నియామక ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. యుద్ధంలో మరణించిన సైనికుల భార్యల కుమారులు, మాజీ సైనికుల పిల్లలు, ప్రస్తుతం సైన్యంలో పనిచేస్తున్న సైనికుల పిల్లలు, సైనికులు, మాజీ సైనికుల సోదరులు, నిర్దేశిత అర్హతలు కలిగిన క్రీడాకారులు తదితర అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలకు అనుగుణంగా ఈ నియామక ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

**పలు విభాగాల్లో నియామకాలు**

అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత పోస్టులకు నిర్దేశించిన వయోపరిమితి, విద్యార్హతలు, ఇతర అర్హతలను ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. నియామక ప్రక్రియలో భాగంగా శారీరక దారుఢ్య పరీక్షలు, శారీరక కొలతల పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు తదితర దశలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, వయస్సు, ఇతర అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**దళారులను నమ్మి మోసపోవద్దు**

సైన్యంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ యువతకు సూచించారు. నియామకాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధికారిక ప్రకటనల్లో పేర్కొన్న సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు.

# అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీలు

- ✸ సహజ ప్రసవాలు తక్కువగా జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన డాక్టర్ ఎం. రవిబాబు
- ✸ గర్భిణులు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం
- ✸ మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, వైద్య రికార్డుల పరిశీలన
- ✸ ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచన



**అత్తిలి, పెన్ పవర్ అక్టోబర్ 17:**ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు గర్భిణీ స్త్రీలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. రవిబాబు వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

**సహజ ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సహజ ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండటంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం. రవిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై అవగాహన కల్పించడంతో పాటు సురక్షిత ప్రసవాలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.

**గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవల గురించి జిల్లా వైద్యాధికారి ఆరా తీశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చిన్నారులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు తీరును సమీక్షించారు. చిన్నారులకు నిర్ణీత సమయాల్లో టీకాలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**మందుల నిల్వలు, రికార్డుల పరిశీలన**

ఆసుపత్రిలో సిబ్బంది హాజరు పట్టికలు, వైద్య రికార్డులను జిల్లా వైద్యాధికారి పరిశీలించారు. విధుల నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఫార్మాసిస్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మందుల కొరత ఏర్పడకుండా నిల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**ఆసుపత్రి పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు**

ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి పరిశుభ్రత నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆసుపత్రి ప్రాంగణం, రోగుల చికిత్స గదులు, ఇతర విభాగాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారి డాక్టర్ కె. నాగరాజుకు సూచించారు. రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా మాతా శిశు సంరక్షణ సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రజలకు అందుతున్న వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె. నాగరాజు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వాహన్ , సారథి ఆన్‌లైన్‌లో 86 సేవలు రవాణా శాఖ సేవలు



జిల్లా రవాణా శాఖాధికారి ఆర్. సురేష్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,అక్టోబర్ 16:**ప్రజలకు వేగవంతమైన, పారదర్శక రవాణా శాఖ సేవలను అందించేందుకు 'వాహన్', 'సారథి' (ఎన్ఐసీ) పోర్టళ్ల ద్వారా 86 సేవలను ఆన్‌లైన్‌లో అందుబా టులోకి వచ్చినట్లు తూర్పు గోదావరి జిల్లా రవాణా శాఖాధికారి ఆర్. సురేష్ తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అర్హతను బట్టి ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సేవలు పొందవచ్చునన్నారు.

వాహన యాజమాన్య హక్కుల బదిలీ, ఫైనాన్స్ నోటింగ్, ఫైనాన్స్ టెర్మినేషన్ వంటి వాహన సేవలతోపాటు, లెర్నర్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్), డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, చిరునామా మార్పు తదితర సేవలకు అధికారిక పోర్టళ్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిబంధనల ప్రకారం ఓటీపీ ధ్రువీకరణ, ఆన్‌లైన్ రుసుము చెల్లింపు లు చేసి సేవలు పొందవచ్చున్నారు. ఇంటి నుంచే లెర్నర్ లైసెన్స్ పరీక్షకు హాజరయ్యే వెసులుబాటు ఉందని వివరించారు. వాహన బదిలీ, ఫైనాన్స్ నోటింగ్, ఫైనాన్స్ టెర్మినేషన్ ప్రక్రియలను ఆటో అప్రూవల్ విధానంలోకి తీసుకురా వడానికి సాంకేతిక నవీకరణలు చేపడుతు న్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి తెలిపారు. ఆన్‌లైన్ సేవల ఆమోద ప్రక్రియలో ఆలస్యం జరుగుతున్నందున, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అక్టోబర్ 16 నుంచి రవాణా శాఖ కార్యాలయంలో సేవలకు ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆలస్యమవుతున్న వాహనదారులు కార్యాలయాన్ని సంప్రదించి అవసరమైన మార్పులు, రుసుముల చెల్లింపులు పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో మాన్యువల్ డ్రైవింగ్ ట్రాక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం లైసెన్స్ జారీ చేపడతామని, ఉత్తీర్ణత సాధించని వారు తిరిగి స్లాట్ బుక్ చేసుకొని పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని వివరించారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడానికి ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. రవాణా శాఖ సేవలను ప్రజలు అధికారిక ఆన్‌లైన్ పోర్టళ్ల మీ-సేవ, కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ద్వారా పొందాలని జిల్లా రవాణా శాఖాధికారి సూచించారు. ప్రభుత్వ నిర్ణీత రుసుములు చెల్లించాలని, కార్యాలయం పేరుతో అదనపు మొత్తాలు వసూలు చేసే మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. సేవలు పొందడంలో సమస్యలు , సందేహాలున్నా వేధింపులకు గురైనా జిల్లా రవాణా శాఖాధికారిని సంప్రదించవచ్చని తెలిపారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు-ఎస్పీ నరసింహ కిషోర్

**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 17:**స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశించారు. ఈ మేరకు కొవ్వూరు సబ్ డివిజన్ కార్యాలయంలో సంబంధిత పోలీసు అధికారులతో ఆయన ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై నిఘా, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను పక్కాగా గుర్తించి అక్కడ పటిష్ట నిఘా, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపట్టడంతో పాటు పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్లను తక్షణమే అమలు చేయాలని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసి, అక్రమ నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువుల రవాణాను అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా తప్పుడు వార్తలు, వదంతులు, విద్వేషపూరిత పోస్టులు పెట్టేవారిపై ఐటీ చట్టం ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డులు, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అధికారులు



అందుబాటులో ఉంచుకోవాలని, స్థానిక ప్రజలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం సమాచారం సేకరించాలని, ఎలాంటి చిన్న సంఘటన జరిగినా ఉన్నతాధికారులకు వెంటనే నివేదించాలని స్పష్టం చేశారు. పటిష్ట బందోబస్తు, పాత కేసుల పరిష్కారం: గత ఎన్నికల సంబంధిత కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేంత వరకు సిబ్బంది అంతా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, ఎన్నికల ప్రక్రియలో చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు తావులేకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డిఎస్పీ జి.దేవకుమార్, సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానికుడి నిలబెట్టాలి




**బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో మేయరు సీటు ఎస్సీ వర్గానికి రిజర్వ్ చేయడం అభినందనీయమని,అయితే మేయరుగా దిగుమతి చేసుకునే అభ్యర్థిని నిలబెట్టవద్దని కూటమి పార్టీలకు రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రెస్ క్లబ్ లో శనివారం మీడియా సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ నగర ప్రజలకు తెలిసిన వ్యక్తి, ఏ పార్టీలో అయినా సేవలు అందించిన స్థానిక వ్యక్తిని, ఫూలే, అంబేద్కర్ భావజాలం ఉన్నవారికి అవకాశం కల్పించాలని కోరారు. 2024 ఎన్నికల్లో బయట నుంచి తెచ్చిన దగ్గుబాటి పురందేశ్వరిని ఎంపీగా గెలిపించామని, కాని ఆమె నియోజవర్గానికి ఒక్క పరిశ్రమ తీసుకురాలేదని, స్థానిక ప్రజలను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మేయరుగా అయినా స్థానిక వ్యక్తులకు కూటమి పార్టీలు సీటు కేటాయిస్తే తాము గెలిపించుకుంటామని. చెప్పారు. కార్పొరేషన్ పరిధిలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు లక్షన్నర ఓట్లు ఉన్నాయని వీరంతా మేయరు గెలుపు ఓటములను నిర్ణయిస్తారని రామారావు చెప్పారు. దిగుమతి అభ్యర్థిని దించితే తమ సంఘం తరుపున మాదిగ సామాజిక వర్గానికి చెందిన బోయినపల్లి కరుణాకర్ ను అభ్యర్థిగా నిలబెడతామని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు బి.జార్జి ఆంటోని, రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్.వి.ప్రసాద్, చైర్మన్ గుమ్మడి సమర్పణరావు మాట్లాడుతూ నగరానికి సుపరిచితులైన వ్యక్తిని కూటమి పార్టీలు అభ్యర్థిగా నిలపాలని కోరారు. తాము ఏ పార్టీకి అనుకూలం కాదని, ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని , దిగుమతి అభ్యర్థులకు వ్యతిరేకమన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మట్టపర్తి సత్యనారాయణ,పోలవరపు రాము,యు.గంగాధర్,పలివెల సత్యనారాయణ,పిల్లి రమణ, నక్కా సోమేశ్వరరావు,బి.కరుణాకర్,కోనా లాజరు,ఎం.కిరణ్ కుమార్,జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# టార్చ్ ఫిన్‌టెక్ సంస్థతో నన్నయ వర్సిటీ ఎంవోయూ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, ప్రాయోగిక పరిజ్ఞానం అందించడం, ఉన్నత విద్యను ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేయడం లక్ష్యంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, టార్చ్ ఫిన్‌టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం తరపున రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, టార్చ్ ఫిన్‌టెక్ కో ఫౌండర్ ఎస్ వైభవ్ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి పరస్పర సహకారానికి అంగీకారం తెలిపారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిశ్రమల పనితీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక రంగంలో చోటుచేసు కుంటున్న మార్పులు, నూతన ఉపాధి అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయ విద్యను పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు. సంస్థ సహ వ్యవస్థాపకులు ఎస్ వైభవ్, కె. రవి కుమార్ లు మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ విద్యార్థులు, నూతన ఆవిష్కర్తల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎంఓయూ తో విశ్వవిద్యాలయంలో అవకాశం కల్పించిన వీసీ, అధికారులకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయా అధికారులు డా వి పెర్సిస్, ఆచార్య బి జగన్మోహన్ రెడ్డి, డా. పి వెంకటేశ్వ రరావు, సంస్థ ప్రతినిధులు రీజినల్ మేనేజర్ బి. విద్యాసాగర్, బ్రాంచ్ మేనేజర్ టి. సాయిరామ్ పాల్గొన్నారు.

# దళిత హక్కుల పరిరక్షణకు మరో ఉద్యమం



- అక్టోబర్ 13ను 'దళిత హక్కుల దినం గా పాటించాలి
- మాజీ మంత్రి చింతా మోహన్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, మత హక్కుల పరిరక్షణే లక్ష్యంగా మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు మాజీ కేంద్ర మంత్రి, మాజీ ఎంపీ చింతా మోహన్ తెలిపారు. వందేళ్ల క్రితం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మురుగన్ అనే దళితుడు ప్రవేశించి కర్పూర హారతి ఇచ్చిన చారిత్రక ఘటనకు గుర్తుగా అక్టోబర్ 13వ తేదీని దళితుల హక్కుల దినం గా ప్రకటించినట్లు తెలిపారు. ఈ చారిత్రక ఘట్టం శతాబ్ది ఉత్సవాలను దేశవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల్లో ఏడాది పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం మంజీరా హోటల్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1925 అక్టోబర్ 13న జరిగిన ఈ ఘటన దళితుల ఆలయ ప్రవేశ హక్కులు, సామాజిక సమానత్వ పోరాట చరిత్రలో ప్రాధాన్యత కలిగిన దన్నారు .కులవివక్షకు వ్యతిరేకంగా అందరికీ సమాన హక్కులు కల్పించాలనే సందేశాన్ని ఈ శతాబ్ది ఉత్సవాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, ఓబీసీ వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో మార్పులు, ఓటర్ల తొలగింపులలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన చెందుతోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, అర్హులైన పౌరుల ఓటు జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయ మార్పులు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజాస్వామ్యానికి, సామాజిక సామరస్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని విమర్శించారు.

# మహంకాళమ్మతల్లి 8వ వార్షిక దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో

## శ్రీ కాత్యాయనీదేవి అలంకారంలో శ్రీదేవి మహంకాళమ్మతల్లి.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 17.**ఏలూరురోడ్డులోని వించేసియున్న శ్రీదేవి మహంకాళమ్మతల్లి ప్రతిరూప ఆలయం 8వ వార్షిక దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7 రోజున, శ్రీకాత్యాయనీదేవి అలంకారంలో శ్రీదేవి మహంకాళమ్మతల్లిని అలంకరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారి అలంకరణకు దంపతులు కాత్యాయని దేవి అలంకరణ తొ ఆలయ ప్రాంగణంలో పూజా లు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. దసరా సందర్భంగా 7వా రోజున దేవి అలంకారంలోని అమ్మవారిని దర్శించికోవడానికి భక్తులు విశేషంగా వచ్చారు. ఏలూరు రోడ్లోని ఆలయ పరిసర ప్రాంతాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీదేవి మహంకాళమ్మతల్లి ఆలయ వ్యవస్థాపకులు మరియు నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు యెగ్గిన నాగబాబుగారు, మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈరోజు అలంకరణ దాతలు గంటా వెంకట సత్యనారాయణ, శ్రీమతి శకుంతల దంపతులు

# అమ్మవారి వెండి గోపురానికి 100 గ్రాముల వెండి విరాళం



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్17:**గోకవరం దేవి చౌక్‌లో కొలువుదీరిన అమ్మవారి ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. అమ్మవారి వెండి గోపురం నిర్మాణం నిమిత్తం విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, ఆయన సతీమణి సిరి దంపతులు 100 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు.

అమ్మవారిపై తమకున్న భక్తి, విశ్వాసంతో ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే సదుద్దేశంతో శివ రమేష్ రెడ్డి దంపతులు ఈ విరాళాన్ని అందించడం విశేషం. దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు భక్తులు తమవంతు సహకారం అందించడం సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను మరింత పెంపొందిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.గోకవరం దేవి చౌక్ అమ్మవారి వెండి గోపురం నిర్మాణానికి అవసర మైన సహకారాన్ని అందించడం ద్వారా శివ రమేష్ రెడ్డి దంపతులు తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా భక్తులు, దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా విరాళాలు అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.ఈ సందర్భంగా దాత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి, సిరి దంపతులకు పలువురు అభినందనలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు దాతల కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.ఈ కార్యక్రమంలో విజయ దుర్గ బ్రాయిలర్స్ అధినేత గుడిమెట్ల శివ రమేష్ రెడ్డి దంపతుల వెంట గోకవరంలోని ప్రసన్నలక్ష్మి చికెన్ సెంటర్ అధినేత కర్రి సూరా రెడ్డి పాల్గొన్నారు.ం

# శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

**తాళ్ళపూడిలో వైభవంగా 25వ దసరా మహోత్సవాలు**



**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 17:**తాళ్ళపూడిలోని ప్రసిద్ధ శ్రీ నవదుర్గాది పరివార శ్రీ చక్ర సహిత శ్రీ కనకదుర్గ అమ్మవార్ల దేవాలయంలో 25వ దసరా మహోత్సవాలు అత్యంత ఘనంగా, వైభవంగా జరుగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో శోభాయమానంగా దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలి సూర్యనారాయణ, నీలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆలయ రజతోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 25వ దసరా మహోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులందరూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జగన్మాత కృపాకటాక్షాలు, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, నాయకులు దూడల నాగు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఉర్దూ అకాడమీని సందర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఉర్దూ అకాడమీ ను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సందర్శించారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఉర్దూ అకాడమీ, షాపింగ్ కాంప్లెక్స్ ను ఆయన పరిశీలించారు. గోకవరం బస్టాండ్ పరిధిలోని మున్సిపల్ దుకాణాల లీజు ప్రక్రియపై వ్యాపారులతో చర్చించారు. 230 దుకాణాలకు గాను 200కు పైగా దుకాణాల లీజు ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడైంది. దుకాణాల లీజుల లో వ్యాపారుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేయకుండా నిబంధనల ప్రకారం నిర్వహించినట్లు ఎమ్మెల్యే వాసు తెలిపారు. ఉర్దూ అకాడమీ సిబ్బందితో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ముస్లిం మైనారిటీ నాయకులు చాంద్ బాష, రఫీక్ రాజా, సయ్యద్ అప్సరీ, అస్లాం,సిబషీరుద్దీన్ బాబు, బాబా ఖాన్, అహ్మదున్నిసా, అహమ్మద్, ఎస్ ఏ కరీమ్, ఖలీల్, వ్యాపారులు ఆయన వెంట ఉన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com